వారంలో మూడు రోజులే..!

- ఆదివారం కనిపించని వార్డెన్లు
- అసలే పరీక్షల కాలం
- విద్యార్థులను గాలికి వదిలేసిన వైనం



మానుకోటలో బీసీ బాలికల కళాశాల వసతిగృహం

మహబూబాబాద్ అర్బన్: అసలే పరీక్షల కాలం, ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈనెల 21నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉంది. కానీ మెజార్టీ వార్డెన్లు ఆ బాధ్యతను విస్మరిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులే చెబుతున్నారు. పరీక్షలు నడుస్తున్నాయి, తమ గురించి పట్టించుకోవడం లేదని అంటున్నారు. స్వయంగా కలెక్టర్ నిత్యం జిల్లాలో సంక్షేమ హాస్టల్ గురుకులాలను తనిఖీలు చేస్తున్నారు. కొందరు వార్డెన్ల పనితీరుపై ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టళ్లలో కొందరు వార్డెన్లలో మార్పు కనిపించడం లేదు. రోజూ రాత్రి 8నుంచి 9గంటల వరకు విద్యార్థులను చదివించాల్సిన బాధ్యతను వార్డెన్లపై ఉంచారు. కానీ పలువురు వార్డెన్లు స్థానికంగా ఉండకపోవడం, రోజు విడిచి రోజు వరంగల్ ఖమ్మం నుంచి అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. శనివారం ఒక్కరోజు వచ్చి ఆదివారం, సోమవారం రారు, మళ్లీ మంగళవారం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులకు కావాల్సిన మెనూ సరుకులను వంట మనుషులకు అందజేసి బుధవారం సెలవు అని వెళ్లిపోతారు. ఇలా జిల్లాలో కొంతమంది వార్డెన్లు వారంలో మూడు రోజులు విధులు నిర్వహించి మూడు రోజులు హాస్టళ్లకు డుమ్మా కొడుతున్నారని పలువురు విద్యార్థులు తెలుపుతున్నారు.

జిల్లాలో మొత్తం 6 పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. మూడు బాలికల, మూడు బాలుర వసతి గృహాలు కలవు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లు మొత్తం జిల్లాలో 8 ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో మొత్తం 1050 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల ఆలనాపాలన చూడాల్సిన బాధ్యులు పర్యవేక్షణను గాలికొదిలేశారు. ఉన్నతాధికారులు సైతం వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులకు పరీక్షల సమయంలో అందుబాటులో ఉండని సమయపాలన పాటించని వార్డెన్లపైచర్య తీసుకోవాలని విద్యార్థులు చెబుతున్నారు.

అందుబాటులో ఉండాలి



పరీక్షల సమయంలో విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వార్డెన్లు అందుబాటులో ఉండడం లేదు. రెండు రోజులకోసారి ఇష్టానుసారంగా హాస్టళ్లకు వస్తున్నారు. నూతనంగా ప్రభుత్వం ప్రకటించిన మెనూ పాటించడం లేదు. పరీక్ష సమయంలో అందుబాటులో లేని వార్డెన్లపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి చర్య తీసుకోవాలని కోరారు.

- చిత్తారి సోమన్న, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

దంతాలపల్లి: రాష్ట్రంలో గ్రామపంచాయతీలో విధులు నిర్వహించే సిబ్బంది మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి సిబ్బందిని పర్మనెంట్ చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నా.. వారి కష్టానికి తగ్గ వేతనాలు రావడం లేదన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కందగట్ల యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా కారెం సురేష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు



శిశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

చిన్నగూడూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన పాక రమాదేవి ఆదివారం పురిటి నొప్పులతో ఉగ్గంపల్లి పీహెచ్‌సీకి రావడంతో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ చేశాడు. ఈకాన్పులో 2.75 కేజీల బరువుతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. స్టాఫ్ నర్సు మాధవి, ఏఎన్‌ఎం భారతి ఉన్నారు.

మానసిక దివ్యాంగుడిపై దాడి సరికాదు



మాట్లాడుతున్న జంపాల వెంకన్న

గార్ల: మానసిక దివ్యాంగుడిపై దాడిచేసి, తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంపాల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. మండలంలోని పాతపోచారం గ్రామంలో నాయిబ్రాహ్మణ కులానికి చెందిన దూదిపాల నగేష్ పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడని, అదే గ్రామానికి చెందిన బట్టు సీతారాములు అనే వ్యక్తి, దివ్యాంగుడిపై కర్రతో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైందన్నారు. గతంలో సైతం సీతారాములు పలుమార్లు దివ్యాంగుడిపై దాడి చేసినట్లు ఆయన ఆరోపించారు. బాధితుడి తండ్రి సత్యం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కుసుమాంజలి సూర్య

గంగారం: మండలంలోని కామారం గ్రామంలో కల్తి వంశీయుల ఇలవేల్పు అయిన గాదరాజు గుడి నిర్మాణానికి మంత్రి దనసరి సీతక్క ఆదేశాల మేరకు ములుగు నియోకజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కుంజ కుసుమాంజలి సూర్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కుసుమాంజలి మాట్లాడుతూ.. త్వరలోనే మెయిన్ రోడ్డు నుంచి గుడి వరకు సీసీ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మడగూడ గ్రామపంచాయతీలో అల్లూరి సీతారామరాజు యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, సువర్ణపాక సరోజన, ఈసం రమ సురేష్, ముంకిడి విజయ్‌కుమార్, రణధీర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

నాలుగు షాపుల్లో చోరీ

కురవి: మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయానికి కూతవేటు దూరంలో మరిపెడ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న పలుషాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వరుసగా నాలుగు షాపుల్లో దొంగతనం చేశారు. తొలుత మోక్షసాయి కిరాణం షాపు ఎదుట ఫ్రీజర్‌ను పగులగొట్టారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. ఫ్రీజర్‌లోని బీర్లు తీసుకుని దొంగతానికి వచ్చిన ఓ వ్యక్తి 'అరే అభి' రారా స్ట్రాంగ్ బీర్లు ఉన్నాయని ఇంట్లో ఉండే సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. అక్కడి నుంచి అదే రోడ్డులో వీఎస్‌బీ బెంగుళూరు అయ్యంగార్ బేకరీ షటర్‌ను గడ్డపారతో పైకి లేపి, చిన్న షటర్‌ను పైకి లేపి షాపులో రూ.50వేల నగదు దోచుకెళ్లారు. అదే విధంగా మధు బెంగుళూరు బేకరీ షట్టర్‌ను పైకి లేపి అందులో కొంత నగదును తీసుకెళ్లారు. అందులో ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. అక్కడి నుంచి నేరుగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న పాన్ షాపు తలుపులు తీసుకుని సిగరేట్ పెట్టెలను ఎత్తుకెళ్లారు. కురవి పోలీసులకు ఆదివారం సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కురవి మండలం బలపాల శివారు లింగ్యా తండా గ్రామంలో తండా మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్ ఇంట్లో పల్సర్ ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో తల్లాడ ఉమేష్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొడుకు పుట్టువెంట్రుకలను తీసుకుని వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబంతో సహా బంధువులు ఆదివారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి వచ్చారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి బీరువా డోర్‌ను తెరిచి అందులో ఉన్న రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న ఉమేష్ వెంటనే ఇంటికి చేరుకున్నాడు. చోరీ విషయాన్ని సీరోలు పోలీసులకు సమాచారం అందజేశాడు. క్లూస్ టీం సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి తనిఖీ చేశారు. బాధితుడు ఉమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీరోలు ఎస్సై నగేష్ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

మరిపెడ రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటా నల్లబెల్లం, 10కిలోల పటిక పట్టుకొని, కిరాణ షాపు యాజమానిపై ఆదివారం కేసు నమోదు చేశారు. మరిపెడ ఎస్సై బొలగాని సతీష్ కథనం ప్రకారం.. మరిపెడ మండలం చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రేఖ్యతండాకు చెందిన బానోతు ఠాగూర్ తన కిరాణషాపులో అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటా నల్లబెల్లం, 10కిలోల పట్టికను సమాచారం మేరకు గుర్తించామన్నారు. షాపు యాజమాని బానోతు ఠాగూర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో యువజన సంఘం సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాధవపెద్ది ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గొర్రె వెంకన్న, హితేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్యశిబిరం



మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ భద్రునాయక్, జిల్లా కార్యదర్శు దాసరి మహేందర్, బోడ యాకూబ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ మాధవిలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిపై పర్యవేక్షణ చేయాలి

నెహ్రూసెంటర్: మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, మద్యం సీసాలు దర్శనమిస్తున్న సంఘటనపై ఆస్పత్రి అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో మద్యం సీసాలు కనిపిస్తున్నాయని, నిత్యం రోగులు వచ్చే ఆస్పత్రిలో పరిశుభ్రత కొరవడిందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరిపెడ రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఇద్దరు డ్రైవర్లపై అదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై బొలగాని సతీష్ కథనం ప్రకారం.. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మంచ్యతండాకు చెందిన గుగులోతు నరేష్, అదేవిధంగా సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం మామిళ్లమడవ గ్రామ రెవెన్యూ పరిధిలోని పీర్యతండా గ్రామానికి చెందిన భూక్య భద్రు అనే ట్రాక్టర్ల డ్రైవర్లు పాలేరు, ఆకేరు వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. సమాచారం మేరకు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్వాధీనం చేసుకొని, సదరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కురవి: ఈనెల 16న కురవిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.లాలు తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి: విప్లవ మేధావి, ప్రతిఘటన ఉద్యమ దళపతి రాయల సుభాష్ చంద్రబోస్, అలియాస్ రవన్న ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 11న ఖమ్మం పట్టణంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇరుగు నాగన్న, ఎస్‌కె సాజన్, వల్లపు సాయలు, వంశీ, వెంకటరెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

రూ.30వేల ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన నాగయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా, హైలెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30వేల ఆర్థిసాయాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

సుదర్శన హోమం

మరిపెడ రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ గంట్ల రంగారెడ్డి, ఉల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రూప్ల నాయక్, కొంపెల్లి వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: గిరిజనుల హక్కుల సాధన కోసం ఈనెల 30వ తేదీన మానుకోటలో జరగనున్న సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్సూర్‌నాయక్, భిక్షం నాయక్, భగవత్, నరేష్, హతిరాం, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా రాజు

బయ్యారం: సీపీఐ అనుబంధ మండల రైతు సంఘం అధ్యక్షుడిగా మందనపు రాజును ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బందెల కొళింగరెడ్డితోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.శ్రీనివాస్, నాయకులు వీరన్న, సారిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

మరిపెడ రూరల్: మున్సిపాలిటీలోని పరలోక క్రీస్తు కృప ప్రార్థన మందిరంలో బడాఓ బంజారా ఫోజేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కల్యాణిసాగర్, విజయ సూర్యసాగర్ సింగ్, ప్రియ విజయ సింగ్, క్రిస్టినా. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య లాజరస్ లాల్‌సింగ్, చర్చి ఫాదర్ సీహెచ్ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య మృతి తీరని లోటు

తొర్రూరు: స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య మృతి నియోజకవర్గానికి తీరని లోటు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈమేరకు పట్టణంలో దాసరి మల్లయ్య కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి పరామర్శించారు. పరామర్శలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

అర్చకుడికి ఇల్లు నిర్మించిన దాత

గార్ల: మండలంలోని సీతంపేట రామాలయంలో పనిచేస్తున్న యాదగిరిస్వామి అనే అర్చకుడికి దాత ఏరుకొండ శ్రీనివాస్ 3నెలల్లోనే ఇల్లు నిర్మించిన ఆదివారం గృహ ప్రవేశం చేయించాడు. అనంతరం భోజన కార్యక్రమం ఏర్పాటు చేశాడు. ఈసందర్భంగా దాత శ్రీనివాస్‌ను గ్రామస్తులు అభినందించారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు

దంతాలపల్లి: నకిలీ పురుగుమందులు విక్రయించి రైతులను మోసం చేస్తే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వాహిని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని వేములపల్లి, కుమ్మరికుంట్ల, రేపోణి గ్రామాలలో తిరుగుతూ నకిలీ మందులను విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో ఎవరైన తిరుగుతూ కంపెనీ మందులని, రాయితీ ఇస్తామని అమ్మకాలు జరిపినట్లు తెలిస్తే తెలియజేయాలని కోరారు.

ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న నీలం దుర్గేష్

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని మానుకోట ముదిరాజ్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం దుర్గేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు అన్నివిధాలుగా వెనుకబడి ఉన్నారని, రాజకీయ, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సహదేవ్, కొత్తూరి రమేష్, ఎదుర బోయిన సూరయ్య, శీల సత్యనారాయణ, సింగని అశోక్, గడ్డం నాగార్జున, భద్రయ్య, పిచ్చయ్య, రాజు, యాకయ్య, సునీల్, నాగేశ్వర్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మహబూబాబాద్: మహిళలను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు



మహబూబాబాద్ అర్బన్: కంకరబోర్డు జెడ్పీహెచ్‌ఎస్‌లో..



మరిపెడ రూరల్: ఆర్‌సీఎం చర్చిలో..

మహబూబాబాద్/నెహ్రూసెంటర్: మహిళలు అన్నిరంగాలల్లో రాణించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు కిషన్ నాయక్ అన్నారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎంపీ మాలోతు కవిత నివాసంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆర్‌సీఎం చర్చిలో..

మరిపెడ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ నారా సురేష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపగురువు ప్రదీప్, మెరుగు సంజీవ, బొడ్డు ఆనందరావు, ప్రసాద్‌రాజు, భరత్ బాలు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామోజీ, సుజాత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ హాజరై మాట్లాడారు.

136 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం డీసీఎం

పెద్దవంగర: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో తెల్లవారు జామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హైదరాబాద్‌కు రేషన్ బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి డీసీఎం వాహనంలో తరలిస్తున్న 120క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వాహనంతోపాటు నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రుద్రాయగూడెం గ్రామానికి చెందిన మేకల నాగయ్య, హైదరాబాద్ కొత్తపేటకు చెందిన ఐత కృష్ణ, అలాగే లొట్లబండ తండాలో ఓ ఆటోలో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుపడ్డాయి. తనిఖీ చేయగా సిద్దిపేట జిల్లా జైదాపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు, పెద్దవంగర (ఇదే మండలం) బావోజీ తండాకు చెందిన ఆటోడ్రైవర్ ధారావత్ కోబ్లా అను వ్యక్తులు అక్రమంగా తరలిస్తుండగా పట్టుపడ్డారు. రెండు వాహనాల్లో మొత్తం 136 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం



నిరుపయోగంగా మారిన గోపాలమిత్ర భవనం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన గోపాలమిత్ర భవనం నిరుపయోగంగా మారింది. గ్రామంలోని రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు వైద్యం అవసరమున్నప్పుడు సేవలు అందించేందుకు నిర్మించిన గోపాలమిత్ర భవనం సరైన వసతులులేక అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. విద్యుత్ కనెక్షన్, వైరింగ్, ఇతర పనులు పూర్తికాక భవనం గేదెలు, మేకలు, గొర్రెలకు ఆవాసంగా తయారైంది. అంతేకాకుండా భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం లేక వర్షం వచ్చినప్పుడు ఆ పక్కనే ఉన్న చెరువు నిండి నీరు కూడా భవనం పరిసరాల్లోకి వచ్చి చేరుతుంది. దీంతో ప్రాంతంలో ముళ్లచెట్లు పెరిగి చెత్తాచెదారంతో దుర్వాసన వస్తూ అపరిశుభ్రంగా కనిపిస్తుంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన గోపాలమిత్ర భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల ఇబ్బందులు



గ్రామంలో నిర్మించిన గోపాలమిత్ర భవనం సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా నిరుపయోగంగా మారింది. పశువులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు పట్టణానికి వెళ్లాల్సివస్తుండగా ఆర్థికభారం పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం గోపాలమిత్ర భవనంలో మిగిలిపోయిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి. లేకుంటే భవనం శిథిలమైపోయే అవకాశం ఉంది.

- బొందెకోల ఈశ్వర్, మాజీ ఉప సర్పంచ్

కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకర బోర్డులో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఉర్దూ ఘర్ షాదీఖాన్ నూతన అభివృద్ధి కమిటీని ఎనుకున్నట్లు మహ్మద్ ఇక్బాల్ ఆదివారం తెలిపారు. కమిటీ సభ్యులుగా షేక్ ఆసీఫ్‌అలీ, మహమ్మద్ ఫజల్, మహ్మమద్ యాకూబ్‌పాషా, జాకీర్, ఇస్మాయిల్, సయ్యద్ ఇమామ్ హుస్సేన్, షేఖ్ ఫయాజ్, అబ్దుల్ నయీమ్, ఫహాద్ హుస్సేన్, మహమ్మద్ అమీర్ ఖాన్, ఫయాజుద్దీన్, తదితరులను ఎన్నుకున్నారు.

మహిళలు ఉద్యమించాలి

పాలకుర్తి: మహిళలు తమ హక్కుల సాధన కోసం పోరాడి తమ భారాన్ని తగ్గించుకున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళలు హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న అన్నారు. ఆదివారం పాలకుర్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యుగాలు, తరాలు మారినప్పటికీ మహిళలపై వివక్షత కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మహిళలు లక్ష్మి, ఉపేంద్ర, ఎల్లమ్మ, సుశీల పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు రావుల రవిందర్ (56) వృత్తిలో భాగంగా ఫిబ్రవరి 28న గ్రామ పరిధిలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు రావుల సంపత్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీనియర్ నాయకుడి మృతి

గార్ల: టీడీపీ మండల సీనియర్ నాయకుడు పతంగి రమేష్(66) గుండెపోటుకు గురై శనివారం గార్లలో మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు రమేశ్, సత్యం, శివాజీ, దరశథ్, రాజా, తదితరులు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.